సాక్షి
యాదాద్రి భువనగిరి

బుధవారం, 22, జనవరి, 2025



'కంటి'కి రెప్పలా..
మునుగోడు నియోజకవర్గానికి చెందిన 90 మందికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి కంటి ఆపరేషన్లు చేయించారు. - 8లో



మాజీ సర్పంచ్‌పై హత్యాయత్నం
పాత కక్షల నేపథ్యంలో శాలిగౌరారం మండలంలోని ఉప్పలంచ గ్రామ మాజీ సర్పంచ్‌పై ఐదుగురు దాడి చేశారు. - 8లో



సమస్యలు పరిష్కరించాలి
ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈఓకు వినతి పత్రం అందజేశారు. - 9లో

ఆర్టీసీకి సంక్రాంతి వెలుగు

పండుగకు నడిపిన బస్సులు 995 .. ఆదాయం రూ.2.78 కోట్లు



డిపోల వారీగా నడిపిన బస్సులు, ఆదాయం వివరాలు..

డిపో (బస్సులు)	దేవరకొండ (93)	కోదాడ (123)	మిర్యాలగూడ(204)	నల్లగొండ(182)	నార్కట్‌పల్లి(63)	సూర్యాపేట (213)	యాదగిరిగుట్ట(117)
ఆదాయం (రూ.లలో)	26,68,854	29,01,864	47,46,896	27,16,448	17,91,455	74,62,545	27,85,468

రామగిరి(నల్లగొండ) : సంక్రాంతి పండుగ ఆర్టీసీకి లాభాల పంట పండించింది. ఈ నెల 9 నుంచి 20 వరకు నల్లగొండ రీజియన్ పరిధిలోని నల్లగొండ, దేవరకొండ, కోదాడ, మిర్యాలగూడ, నార్కట్‌పల్లి, సూర్యాపేట, యాదగిరిగుట్ట డిపోల పరిధిలో అధికారులు ప్రత్యేక సర్వీసులను నడిపారు. ఆయా బస్సుల్లో అదనపు చార్జీలు సైతం వసూలు చేశారు. పండుగ సందర్భంగా 32 లక్షల మంది బస్సుల్లో ప్రయాణించారు. రద్దీకి అనుగుణంగా స్పెషల్ బస్సులను నడిపిన సంస్థ ఆశించిన మేర ఆదాయాన్ని పొందింది.

995 ప్రత్యేక బస్సులు

పండుగకు సుదూర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వెళ్లాలనుకునే వారు ఎక్కువగా ఆర్టీసీ బస్సులనే ఆశ్రయించారు. వీరికోసం ఏడు డిపోల పరిధిలో 995 సర్వీసులు నడిపారు. జిల్లా నుంచి ఎక్కువగా హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు రాకపోకలు సాగించాయి. 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు తిరిగి 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు స్పెషల్ బస్సులు వివిధ రూట్లలో 3.84 లక్షల కిలోమీటర్లు ప్రయాణించగా.. తద్వారా ఆర్టీసీకి రూ.2.5 కోట్ల ఆదాయం దక్కింది. అధిక రాబడి సాధించిన వాటిలో సూర్యాపేట, నార్కట్‌పల్లి, దేవరకొండ డిపోలు ముందు వరుసలో నిలిచాయి.

న్యూస్‌రీల్

ఆంగ్ల భాషతో భవిష్యత్



సర్టిఫికెట్స్ అందజేస్తున్న డీఈఓ సత్యనారాయణ

భువనగిరి: విద్యార్థులకు ఆంగ్ల భాషతో భవిష్యత్ ఉంటుందని డీఈఓ సత్యనారాయణ అన్నారు. మంగళవారం భువనగిరి పట్టణంలోని వెన్నెల కళాశాలలో ఎల్టా (ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస, ఇంగ్లిష్ ఒలంపియాడ్‌పై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాష నైపుణ్యాలను వెలికి తీయడానికి పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు ఆంగ్ల భాషలో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో సీఎంఓ లింగారెడ్డి, ఎల్టా జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, ఒలంపియాడ్ జిల్లా కో ఆర్డినేటర్ రమేష్, సైదులు, రవికుమార్, భాస్కర్‌రెడ్డి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి సంప్రదాయ పూజలు



ఆలయంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.

నేడు యాదగిరిగుట్టకు ఎమ్మెల్సీ కవిత రాక

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 5.15గంటలకు యాదగిరిగుట్ట పట్టణంలోని వైకుంఠ ద్వారం వద్దకు చేరుకుంటారని, అక్కడే కొబ్బరికాయ కొట్టి, శ్రీస్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా యాదగిరి కొండ చుట్టూ నిర్వహించే గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం కొండపైకి వెళ్లి శ్రీస్వామి వారిని దర్శించుకుంటారని వెల్లడించారు.

పనులు వేగవంతం చేయాలి



నాగినేనిపల్లిలో స్థల పరిశీలన చేస్తున్న ఎస్ఈ సుధీర్ కుమార్, డీఈ శ్రీనివాసచారి

బొమ్మలరామారం: మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో ఏర్పాటు చేయనున్న సబ్ స్టేషన్ స్థలాన్ని ఎస్ఈ సుధీర్ కుమార్ మంగళవారం పరిశీలించారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు నిధులు మంజూరైన నేపథ్యంలో నిర్మాణ పనులు వేగవంతం చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. సబ్‌స్టేషన్ కోసం రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు గుర్తించిన స్థలాన్ని కలియదిరిగి అనుకూలంగా ఉందని తెలిపారు. త్వరితగతిన సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట డీఈ శ్రీనివాసచారి, ఏడీ మచ్చేందర్, ఏఈ సాదు సాయిదీప్, జేఎల్ఎం కృష్ణ, నాయకులు రామిడి జంగారెడ్డి, మహిపాల్ రెడ్డి, శ్రీహరి, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, నర్సింహ, యాదగిరి, వెంకటేష్, బాలాచారి ఉన్నారు.

సారూ.. మా పేర్లేవి?

ప్రజాపాలన గ్రామ సభల్లో ప్రజల నుంచి అభ్యంతరాలు

- అర్హుల జాబితాలో పేర్లు లేవంటూ అధికారులను నిలదీసిన ప్రజలు
- పథకాల కోసం మళ్లీ దరఖాస్తు
- బీబీనగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

సాక్షి, యాదాద్రి: రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల కోసం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల్లో అర్హుల జాబితాల్లో పేర్లు రాని వారి నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. జిల్లాలో 17 మండలాల్లో 114 గ్రామ సభలు, ఆరు మున్సిపాలిటీల్లో 25 గ్రామసభలు జరిగాయి. నాలుగు పథకాలకు సంబంధించిన జాబితాల్లోని పేర్లను చదివి వినిపించారు. ఈక్రమంలో అనర్హులను గుర్తించారు. అయితే అర్హత ఉన్నా తమ పేరు ఎందుకు రాలేదని పలువురు అధికారులను ప్రశ్నించారు. కొన్ని చోట్ల అధికారులను నిలదీశారు. దీంతో ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించడంతో ప్రజలు తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో తొలిరోజు గ్రామ సభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 5001, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 1625, రేషన్ కార్డుల కోసం 4543, రైతుభరోసా కోసం 230 మంది దరఖాస్తు చేసుకున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని

యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించి, లబ్ధిదారులను ఎంపిక చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వకుండా, మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు అంటున్నారని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించిన వారికి ఇవ్వాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామ సభ నిర్వహించారు. చొల్లేరు గ్రామంలో గ్రామ సభలో గతంలో రెండు సార్లు రైతు బంధు వేయలేదని, ఆ డబ్బులు కూడా వీటితో పాటుగా చెల్లించాలని, బీఆర్ ఎస్ నాయకులు అధికారులను అడుగుతుండగా గత పదేళ్ల నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమి చేయలేదని, కాంగ్రెస్ నాయకులు అనడంతో, కాసేపు సభ రసాబాసగా మారింది. తర్వాత అధికారులు వివరంగా చెప్పడంతో ముందుకు సాగింది. బీబీనగర్ మండలం రహీంఖాన్ గూడెం ,బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్యన వాగ్వాదం జరిగింది. పథకాలు అర్హులకు ఇవ్వడంలేదని అధికారులను నిలదీశారు.



రాయరావుపేటలో అధికారుల ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

గ్రామ సభల్లో ప్రజా ప్రతినిధులు



అడ్డగూడూరు మండలం మానాయికుంటలో అధికారులకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

తొలిరోజు గ్రామ సభల్లో జిల్లాలో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఆలేరు, రాజాపేట మండలాల్లో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, పోచంపల్లి మండలంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మోత్కూరు, అడ్డగూడూరులో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. వీరితోపాటు కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ నాయకులు గ్రామ సభలకు హాజరయ్యారు. గ్రామసభల సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓ, వ్యవసాయశాఖ అధికారులు గ్రామ సభల్లో పాల్గొన్నారు.

ఇద్దరు బిల్ కలెక్టర్ల సస్పెన్షన్

భువనగిరిటౌన్: జాబితాలో పేరు రాని లబ్ధిదారుల నుంచి తీసుకున్న దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించిన మున్సిపాలిటీ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను వార్డు సభ ప్రత్యేక అధికారి రాధిక, క్లస్టర్ లెవల్ అధికారి రాణితో పాటు హెల్ప్ డెస్క్ సిబ్బంది అయిన ఇన్‌చార్జ్ బిల్ కలెక్టర్లు రాము, ఎండీ షఫీ అక్కడే వదిలి వెళ్లిపోయారు. కొంత మంది చూసిన లబ్ధిదారులు దీనిని మున్సిపాలిటీ కమిషనర్‌కు వీడియో తీసి ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి విచారణ జరిపి దరఖాస్తులను మరిచిపోయిన సభ హెల్ప్ డెస్క్ ఇన్‌చార్జ్‌లైన మున్సిపల్ బిల్ కలెక్టర్లు రాము, ఎండీ షఫీని సస్పెండ్ చేశారు. అదేవిధంగా పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

అధికారులతో వాగ్వాదం..

బీబీనగర్, యాదగిరిగుట్ట, వలిగొండ, మోటకొండూరు మండలాల్లో ప్రజలు అధికారులను ప్రశ్నించారు. నాలుగు సంక్షేమ పథకాలకు ప్రజాపాలన, మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటే అర్హుల పేర్లు జాబితాలో రాలేదని ఆరోపించారు. అనర్హుల పేర్లు ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జాబితాలో చోటు దక్కిందని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈక్రమంలో అనర్హుల పేర్లను జాబితాల నుంచి తొలగిస్తామని హామీ ఇచ్చారు. కాగా బీబీనగర్ మండలంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్యన జాబితాలపై వాగ్వాదం జరిగింది. అధికార పార్టీ నాయకులు తయారు చేసిన జాబితాలను అధికారులు గ్రామ సభలో చదివి వినిపించారని బీఆర్ఎస్ నాయకులు గుండాలలో ఆరోపించారు. వలిగొండ మండలంలో చిత్తాపురంలో వ్యవసాయ భూమిలేని కుటుంబానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో జాబితాలో పేరు రాలేదని మత్స్యగిరి అనే వ్యక్తి ప్రశ్నించడంతో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పడంతో సదరు కుటుంబం దరఖాస్తు చేసుకుంది. బీబీనగర్ మండలం రహీంఖాన్‌గూడెం, రాయరావుపేట, యాదగిరిగుట్ట మండలం చొల్లేరు, వంగపల్లి, చిన్నకందుకూర్, భువనగిరి మండలం తాజ్‌పూర్, మోటకొండూరు మండలం అమ్మనబోలు,గుండాల ఇలాపలు గ్రామాల్లో అధికారులను ప్రజలు ప్రశ్నించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అర్హులకు రాలేదని ఫిర్యాదులు చేశారు. అనర్హులను తొలగిస్తామని చెప్పిన అధికారులు, గ్రామ సభలో ఏర్పాటు చేసిన కౌంటర్లో తమకు పథకాలు ఇవ్వాలని చెప్పడంతో దరఖాస్తు చేసుకున్నారు.

పథకాల అమలు నిరంతర ప్రక్రియ



ముత్తిరెడ్డిగూడెంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి: సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాల కోసం గ్రామ సభలో వచ్చిన దరఖాస్తులను తప్పనిసరిగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని తెలిపారు. వ్యవసాయ సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా గుర్తించినట్లు చెప్పారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు రైతు భరోసా కింద ఎకరానికి రూ. 12వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద లబ్ధిదారులకు ఒక్కో విడత రూ.6వేల చొప్పున రూ.12వేలు చెల్లించేందుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పనిచేసిన వారిని గుర్తించినట్లు తెలిపారు. రేషన్ కార్డులు అర్హులైన ప్రతి ఒక్కరికీ మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఆందోళనకు అవసరం లేదని గ్రామ సభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. అనంతరం గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. సంక్షేమ పథకాల కోసం ఎంపిక చేసిన వివరాలు ప్రకటించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

భువనగిరి: విద్యార్థులు కష్టపడి చదవాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. భువనగిరి పట్టణంలోని సింగన్నగూడెం వద్ద ఉన్న గిరిజన బాలికల వసతి గృహాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. హాస్టల్స్ ఆవరణలో డ్రెయినేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. హాస్టల్స్‌లో కంప్యూటర్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాల ఏర్పాటుకు లైబ్రరీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కాగా.. హాస్టల్‌లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు వార్డెన్ విజయలక్ష్మికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

రాజాపేట: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం రాజాపేట మండలంలోని నెమిల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాల సాధనకు కృషిచేయాలన్నారు. అనంతరం స్థానిక 1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం నాణ్యత, వినియోగం, పిల్లలచే ప్రీస్కూల్ ఆటపాటలు, బాలామృతం గడువుతేదీ, ఆరోగ్యలక్ష్మి వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అర్థమయ్యే విధంగా బోధన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ పద్మను సత్కరించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి జమీల్ తదితరులున్నారు.



విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతరావు

దుశ్చర్ల సత్యనారాయణకు ప్రతిభా పురస్కారం



మోతె : తనకున్న 70 ఎకరాల విస్తీర్ణంలో అడవిని సృష్టించిన జలసాధన సమితి అధ్యక్షుడు, మోతె మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామానికి చెందిన దుశ్చర్ల సత్యనారాయణ గవర్నర్ ప్రతిభా పురస్కారం–2024కు ఎంపికైనట్లు రాజ్‌భవన్ కార్యాలయం కార్యదర్శి దాన కిశోర్ మంగళవారం తెలిపారు. వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తులకు, సంస్థలకు ఈ అవార్డు అందజేయనున్నారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో ఐదేళ్లుగా ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి ఈ పురస్కారాలు అందజేస్తారు. అవార్డుతో పాటు రూ.2 లక్షలు, జ్ఞాపిక ఇవ్వనున్నారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఈ అవార్డును దుశ్చర్ల అందుకోనున్నారు. అవార్డులకు ఎంపికైన ఎనిమిది మందిలో దుశ్చర్ల సత్యనారాయణ ఉండడం విశేషం.

పంటల పరిశీలన

రాజాపేట: మండలంలోని బేగంపేట, రేణికుంట గ్రామాల్లో సాగుచేస్తున్న పంటలను మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ఓ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ఓ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.జయరాం, ఎస్ఎస్ఓ వీఎల్ విజయ, సూపర్‌వైజర్ ఆర్.ప్రభాకర్, వ్యవసాయ శాఖ భువనగిరి ఏడీ ఎస్.నీలిమ, ముఖ్య ప్రణాళిక కార్యాలయం ఉపగణాంక అధికారి ఎస్.లక్ష్మణ్ గ్రామాల్లో 40 సబ్‌డివిజన్లు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వీటి వివరాలను ఫరీదాబాద్ ఎస్ఎస్ఓకు పంపిస్తున్నట్లు తెలిపారు. వారి వెంట మండల ఏఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.



పంటలను పరిశీలిస్తున్న ఎన్ఎస్ఎస్ఓ అధికారులు

ఆర్మీ కళాశాల ఇక లేనట్లేనా!

- ఏడేళ్లుగా బీబీనగర్ మండల పరిధిలో కొనసాగిన మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాల
- భవనం అగ్రిమెంట్ ముగియడంతో మేడ్చల్ జిల్లాకు తరలించాలని నిర్ణయం
- విద్యార్థి సంఘాల నుంచి విమర్శలు రావడంతో అన్నంపట్లలో భవనాన్ని చూసిన అధికారులు
- ఈ భవనం అందుబాటులోకి రాకపోవడంతో వారం క్రితం ఆర్మీ శిక్షణా సామగ్రి కూడా మేడ్చల్‌కు తరలింపు

బీబీనగర్: గురుకుల ఆర్మీ డిగ్రీ మహిళా కళాశాల యాదాద్రి భువనగిరి జిల్లాకు మంజూరు కావడంతో 2018లో బీబీనగర్ మండలం లక్ష్మీదేవిగూడెం గ్రామ పరిధిలో గల ఓ భవనంలో ఏర్పాటు చేసి ప్రారంభించారు. 7సంవత్సరాల పాటు కళాశాల ఇక్కడే కొనసాగింది. జిల్లాకు తలమానికంగా ఉన్న గురుకుల ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాల ఇప్పుడు మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌కు తరలించారు. దీనికి స్థానిక ప్రజా ప్రతినిధుల వైఫల్యమే కారణమని ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి.

భవనం అగ్రిమెంట్ ముగియడంతో...

బీబీనగర్ మండలంలోని గల కళాశాల భవనంలో సంబంధిత యాజమాన్యంతో ఒప్పందం చేసుకుని ప్రభుత్వం ప్రతి నెల పాత భవనానికి రూ.5లక్షల 66వేలు అద్దె చెల్లిస్తూ వచ్చింది. చేసుకున్న అగ్రిమెంట్ ముగియడం, అదే భవనంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు సదరు యాజమాని ఖాళీ చేయాల్సిందిగా ఒత్తిడి తేవడంతో గత ఐదు నెలల క్రితమే కళాశాలను బీబీనగర్ మండలంలోనే మరోచోటకు మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఈమేరకు అన్నంపట్ల గ్రామ పరిధిలో ఖాళీగా గల అగ్రికల్చర్ కళాశాల భవనాన్ని ఓకే చేశారు. కలెక్టర్ సైతం ఆమోదించి నూతన భవనానికి రూ.8లక్షల పై చిలుకు అద్దెను నిర్ణయించారు. దీంతో భవన యజమాని రూ.50లక్షలతో మరమ్మతులు చేయించి విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు, వాష్‌రూంలు ఇతర పనులు చేయించాడు. తీరా కళాశాలను ఘట్‌కేసర్‌లో కొనసాగించేందుకు గురుకుల ఉన్నతాధికారులు నిర్ణయించారు.

ఒకే చోట ఆర్మీ శిక్షణ ఇవ్వొచ్చనే ఉద్దేశంతో..

అన్నంపట్లలోని భవనం పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడానికి సమయం పడుతుందని దీంతో విద్యార్థులకు విద్యకు ఆటంకాలు రాకుండా తాత్కాలికంగా అనువుగా ఉన్న ఘట్‌కేసర్ పరిధిలోని మరో కళాశాల భవనానికి తరలించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చెప్పుకొచ్చారు. తిరిగి కళాశాల ఇక్కడికే తరలిస్తామని పేర్కొన్నారు. కళాశాల తరలింపుపై ప్రతి పక్షాల నుంచి ఒత్తిడి రావడంతో ఎమ్మెల్యే, కలెక్టర్ సైతం గురుకుల అధికారులతో మాట్లాడగా భవనం పనులు పూర్తి కాగానే తరలిస్తామని చెప్పినట్లు సమాచారం. కానీ అన్నంపట్ల భవనానికి తరలించిన తరలించిన ఆర్మీ శిక్షణ పరికరాలను గత వారం రోజుల క్రితం పూర్తిగా ఘట్‌కేసర్‌కు తరలించారు. ప్రభుత్వ పాలసీ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఓ గురుకుల అధికారి తెలిపారు. ఇంటిగ్రేటెడ్ చేయడానికే ఇప్పటికే ఒకే చోట ఉన్న 2 కళాశాలల భవన సముదాయంలోకి ఈ కళాశాలను తరలించినట్లు తెలుస్తోంది. దీంతో మూడు కళాశాల విద్యార్థులకు ఒకే చోట ఆర్మీ శిక్షణ ఇవ్వొచ్చని ప్రభుత్వం భావించడంతో కళాశాలను జిల్లా నుంచి తరలించినట్లు సమాచారం. ఘట్‌కేసర్ పరిధిలోని ప్రిన్స్టన్ ఇంజనీరింగ్ కళాశాల భవన సముదాయంలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించగా ఆర్మీ శిక్షణ పరికరాలను ఏర్పాటు చేసేందుకు ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో గ్రౌండ్ పనులు చేపడుతున్నారు.



వృథాగా మారిన అన్నంపట్లలోని భవనం

ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కొనసాగుతుంది

శిక్షణకు సంబంధించిన పరికరాలను ఇక్కడి నుంచి తరలించడం, శిక్షణ ఏర్పాటుకు సంబంధించి పూర్తిగా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కొనసాగుతుంది. వాటికి సంబంధించిన ప్రక్రియను నేను చూడడం లేదు.

– నిరూప, గురుకుల ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

కనీస వేతనం అమలు చేయాలి

నల్లగొండ టౌన్ : ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం నీలగిరి పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి.. కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, మల్లుగౌతంరెడ్డి, పరమేశ్వరి, వెంకటమ్మ, పార్వతమ్మ, కల్పన, మల్లేశ్వరి, స్వర్ణ,సౌజన్య, విజయకుమారి, ప్రేమలత, రాధ, చింత వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూదరుల అరెస్ట్

చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో పేకాట శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.47వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

భువనగిరిటౌన్: ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడును గుర్తుతెలియని వ్యక్తులు లాక్కొని పారిపోయారు. ఈ ఘటన మంగళవారం భువనగిరి పట్టణంలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... బొమ్మల రామారం మండలం మర్యాల గ్రామానికి చెందిన బాలోతు ధనమ్మ బీబీనగర్ మండలం భట్టుగూడెం గ్రామంలో నివాసముంటోంది. సోమవారం స్వగ్రామానికి వచ్చిన ధనమ్మ మంగళవారం భట్టుగూడేనికి తిరుగు ప్రయాణమయ్యింది. ఈ క్రమంలో ఆమె భువనగిరి బస్టాండ్‌లో బస్సు దిగి పక్కనే ఉన్న టైలర్ షాపులో జాకెట్లు తీసుకునేందుకు వెళ్లగా.. ఆ దుకాణం మూసిఉండటంతో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తోంది. ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ధనమ్మను బస్టాండ్ నుంచే అనుసరిస్తూ ఆమెతో మాటలు కలిపారు. ఈ క్రమంలో అందరూ చూస్తుండగానే ధనమ్మ మెడలోని ఐదు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయారు. ధనమ్మ కేకలు వేస్తూ ఆగంతకుల వెంటపడినప్పటికీ వారు తప్పించుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ చోరీలో మొత్తం ఆరుగురు వ్యక్తులు పాలుపంచుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

రెండు ఇళ్లలో చోరీ

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలోని తారాకరాంనగర్‌లో మంగళవారం రెండు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తారాకరాంనగర్‌లో నివాసముంటున్న అడెపు రవి ఇంటి తాళాన్ని గుర్తుతెలియని వ్యక్తులుళం పగులగొట్టి రూ.20వేల నగదు, తులం బంగారం ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న మరో ఇంట్లో కూడా దొంగలు చొరబడి 10 తులాల వెండి ఆభరణాలు చోరీ చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి టౌన్ పోలీసులు తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం


సైదమ్మ

నాగారం: మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన నంగనూరు సైదమ్మ(65) ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించడంలేదని ఆమె కుమారుడు ఆంజనేయులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ ఎం. ఐలయ్య తెలిపారు. సైదమ్మకు కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా ఉండటంలేదని ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదని ఎస్‌ఐ పేర్కొన్నారు. చుట్టుపక్కల వారు హైదరాబాద్‌లో ఉంటున్న ఆమె కుమారుడు ఆంజనేయులకు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి ఎంత వెతికినా సైదమ్మ ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో నల్లగొండ ఆగమైంది

- జిల్లా అభివృద్ధిపై మంత్రి కోమటిరెడ్డి చర్చకు రావాలి
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్


నల్లగొండలో విలేకరులతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ లింగయ్యయాదవ్ తదితరులు

నల్లగొండ టూటౌన్: కాంగ్రెస్ పాలనలో నల్లగొండ ఆగమైందని, గులాబీ జెండాలను చూసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి భయం పట్టుకుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రూ. 1500 కోట్లతో నల్లగొండను అభివృద్ధి చేశామని, ప్రతి గ్రామంలో తాము చేసిన అభివృద్ధి కనిపిస్తుంది అన్నారు. తాము చేసిన అభివృద్ధిపై చర్చ పెడదామని, ఎప్పుడైనా, ఎక్కడికైనా రావొచ్చని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సవాల్ విసిరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే నల్లగొండలో కరువు, ఫ్లోరైడ్ పెరిగిందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు అతి చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ నుంచి దాడుల పాలిటిక్స్ మొదలు పెట్టిందని విమర్శించారు. గ్రామ సభల్లో ప్రభుత్వ డొల్లతనం బయట పడిందని, దరఖాస్తులు చెత్తబుట్టల్లో వేసి మళ్లీ స్వీకరించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు బెదిరింపులు, అక్రమ కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఎంత ధాన్యం పండించారో చెప్పలేని అసమర్థ ప్రభుత్వమని, రైతు బంధు, రుణమాఫీ ఎగ్గొట్టి మోసం చేశారని అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు కంచర్ల భూపాల్‌రెడ్డి, సైదిరెడ్డిపై ఎందుకు దాడిచేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. సీఎం, మంత్రుల ఒత్తిడితో రైతుల ధర్నాకు అనుమతి ఇవ్వలేదన్నారు. కోర్టు నుంచి అనుమతి వచ్చిన తర్వాత నల్లగొండలో రైతు ధర్నా చేసి తీరుతామని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదన్నారు. తమ నాయకుల జోలికి వస్తే సహించేది లేదన్నారు. పోలీసులు, అధికారులు చట్ట ప్రకారం నడుచుకోవాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, నాయకులు చెరుకు సుధాకర్, కంచర్ల కృష్ణారెడ్డి, మందడి సైదిరెడ్డి, రేగట్టి మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుగుబాటు తప్పదు..

సూర్యాపేటటౌన్: నల్లగొండ జిల్లాలో పోలీసులు, కాంగ్రెస్ గూండాల రాజ్యం నడుస్తుందని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ శ్రేణుల అరెస్టుపై ఆయన మండిపడ్డారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ఫ్లెక్సీలను వదిలిపెట్టి కావాలనే నల్లగొండ మున్సిపాలిటీ అధికారులు బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలు చించేశారన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాటలు విని డ్యూటీ చేస్తే అధికారులకు భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్నారు. భూపాల్‌రెడ్డిని, పార్టీ శ్రేణులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ రహిత తెలంగాణ కోసం నల్లగొండ నుండే ఉద్యమం మొదలవుతుందన్నారు. కాంగ్రెస్ హటావో తెలంగాణా బచావో నినాదం మొదలైందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభల్లో ప్రజల నుంచి వస్తున్న నిరసనలు చూస్తుంటే కాంగ్రెస్ పార్టీపై తిరుగుబాటు మొదలైందన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లుగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని, అర్హత లేని వారికి లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు.

- చూసేది పరీక్షా ఫలితాలు కాదు..


పై ఫొటోలోని వ్యక్తులు పరీక్షా ఫలితాలు చూసుకుంటున్నారని అనుకుంటే పొరపడినట్లే. మంగళవారం నుంచి ప్రారంభమైన ప్రజా పాలన గ్రామ సభలో మోత్కూరు మండలం పొలడుగు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సంక్షేమ పథకాల అర్హుల జాబితాను అధికారులు గోడకు అంటించడంతో అందులో తమ పేరు ఉందా అని చూసుకుంటున్న గ్రామస్తులు. – మోత్కూరు

- నీకు నేనున్నానమ్మా..



నకిరేకల్ మండలం ఓగోడు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఓ వృద్ధురాలు కలిసి తన మొర వినిపించగా.. తానే స్వయంగా గ్రామానికి వచ్చి సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ఆ వృద్ధురాలికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. – నకిరేకల్

యాదగిరీశుడిని దర్శించుకున్న సినీ నటి వైష్ణవి చైతన్య


యాదగిరిగుట్ట ఆలయంలో హీరోయిన్ వైష్ణవి చైతన్య, ఆమె కుటుంబ సభ్యులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని బేబీ సినిమా హీరోయిన్ వైష్ణవి చైతన్య కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తుల వద్ద అష్టోత్తర పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి లడ్డూ ప్రసాదం అందజేశారు.

స్వర్ణగిరి క్షేత్రాన్ని దర్శించుకున్న సినీనటులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామిని మంగళవారం సీనియర్ నటి శివపార్వతి, హీరోయిన్ వైష్ణవి చైతన్య తమ తమ కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారిని శాలువాతో సన్మానించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

సాగర్ పాలిటెక్నిక్ కాలేజీలో క్రీడాపోటీలు

నాగార్జునసాగర్: ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు బుధవారం, గురువారం నాగార్జునసాగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ క్రీడల నిర్వహణకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. క్రీడాకారులు ఈ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మునుగోడు నియోజకవర్గ ప్రజలకు 'కంటి'కి రెప్పలా..

- 90 మందికి కంటి ఆపరేషన్లు చేయించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: మునుగోడు నియోజకవర్గానికి చెందిన 90 మందికి స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని శంకర హాస్పిటల్‌లో దగ్గరుండి కంటి ఆపరేషన్లు చేయించారు. మునుగోడు నియోజకవర్గంలోని ప్రజలకు కంటి సమస్యలు ఉండొద్దనే ఉద్దేశంతో ఇటీవల మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తన తల్లి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 1060 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. అందులో 300 మందికి పైగా శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు తేల్చారు. మొదటి దఫాలో 90 మందిని ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌లోని శంకర హాస్పిటల్‌కు తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించారు. తిరిగి వారందరినీ మంగళవారం బస్సులోనే ఇంటికి పంపించి మరో 90 మందిని ఆపరేషన్లు చేయించేందుకు తీసుకెళ్లారు. ఆపరేషన్లు చేయించుకున్న వారి దగ్గరకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడికి జైలుశిక్ష

చివ్వెంల(సూర్యాపేట): బైక్‌లు చోరీ కేసులో నిందితుడికి జైలుశిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత మంగళవారం తీర్పు వెలువరించారు. తుంగతుర్తి మండలం గానుగబండ గ్రామానికి చెందిన పోలెపాక రమేష్ 2024 ఆగస్టులో సూర్యాపేటలో 3 బైకులు, అదే సంవత్సరం సెప్టెంబర్‌లో ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామ శివారులోని దండు మైసమ్మ ఆలయం వద్ద ఒక బైక్ చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐలు కుశలవ, ఎ. సైదులు కేసు నమోదు చేయగా.. రమేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.హేమలత నాయుడు వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి నాలుగు నెలల పదకొండు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు కోర్టు కానిస్టేబుళ్లు సీహెచ్. రవికుమార్, ఎం. చైతన్య సహకరించారు.

స్కూటీ అపహరించిన కేసులో..

స్కూటీ అపహరించిన వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత మంగళవారం తీర్పు వెలువరించారు. హన్మకొండకు చెందిన వన్నె శివకుమార్ స్కూటీపై ర్యాపిడో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. 2024 ఆగస్టు 8వ తేదీన మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన విన్నకోట సాయికుమార్ హన్మకొండకు వచ్చాడు. స్థానిక బస్టాండ్ వద్ద నుంచి ఖాజీపేట వెళ్లాలని ర్యాపిడోలో బైక్ చేసుకున్నాడు. ర్యాపిడో నడుపుకుంటున్న శివకుమార్ సాయికుమార్‌ను స్కూటీపై హన్మకొండ బస్టాండ్ వద్ద ఎక్కించుకుని ఖాజీపేట వద్ద డ్రాప్ చేశాడు. అయితే తనకు జనగామలో పని ఉందని, బోధకాలు ఉండటం వల్ల నడువలేకపోతున్నానని సాయికుమార్ శివకుమార్‌కు చెప్పి ఎక్కువ డబ్బులు ఇస్తానని చెప్పి జనగామకు తీసుకెళ్లాడు. అక్కడ నుంచి సూర్యాపేటలో పని ఉందని సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ తనకు ఒక తెల్లని వస్త్రం కావాలని షాపులోకి వెళ్లి తీసుకురమ్మని శివకుమార్‌ను షాపులోకి పంపించాడు. శివకుమార్ షాపులోకి వెళ్లగానే అతడి స్కూటీపై సాయికుమార్ పారిపోయాడు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ గోపీకృష్ణ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పబ్లిక్ ప్రాసిక్యూటర్ హేమలతనాయుడు వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి 2నెలల 29రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. పీపీకి కోర్టు కానిస్టేబుల్ రవికుమార్ సహకరించారు.

నాలుగు నెలలు కారాగార శిక్ష..

ఆత్మకూర్ (ఎస్): మండల పరిధిలోని ఏనుబాముల గ్రామ స్టేజీ వద్ద గతేడాది జూన్‌లో బైక్ చోరీ చేసిన నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ బి. శ్రీకాంత్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామానికి చెందిన పి. రమేష్ బైక్ చోరీ చేయగా.. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ సైదులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి 4నెలల 4రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


ధ్వంసమైన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


లిఫ్ట్ పనులకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి (ఫైల్)

కట్టంగూర్: మండలంలోని అయిటిపాముల గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. అయిటిపాముల గ్రామ రిజర్వాయర్ సమీపంలో శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు, రైతులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. రూ.101.62 కోట్లతో 10వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్మించనున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి 2023 29 సెప్టెంబర్‌న శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని కొత్త శిలాఫలకాన్ని నిర్మించాలని చెప్పారు. లేదంటే కలెక్టర్, ఈఎన్‌సీ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు పోగుల నర్సింహ, వడ్డె సైదిరెడ్డి, పెద్ది బాలనర్సింహ, నల్లమాద సైదులు, బెల్లి సుధాకర్, మంగదుడ్ల వెంకన్న, ఎడ్ల చిన్నరాములు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌పై హత్యాయత్నం

- పొలం వద్దకు వెళ్తుండగా మారణాయుధాలతో దాడి
- తీవ్ర గాయాలు.. నిమ్స్ హాస్పిటల్‌కు తరలింపు


బండారు మల్లయ్య


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మల్లయ్య

శాలిగౌరారం: పాత కక్షల నేపథ్యంలో శాలిగౌరారం మండలంలోని ఉప్పలంచ గ్రామ మాజీ సర్పంచ్‌పై ఐదుగురు వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేశారు. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పలంచ గ్రామ మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య(53)కు అదే గ్రామానికి చెందిన రుద్రారం యాదయ్య, రుద్రారం మల్లేష్, రుద్రారం చినయాదయ్యతో కొంతకాలంగా వ్యక్తిగత, రాజకీయ గొడవలు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. 2019 జనవరిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బండారు మల్లయ్య కాంగ్రెస్ నుంచి, రుద్రారం మల్లేశ్ బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో మల్లేశ్‌పై మల్లయ్య గెలుపొందారు. దీంతో మల్లయ్యపై రుద్రారం మల్లేష్ కుటుంబ సభ్యులు రాజకీయంగా కక్ష పెంచుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పాపమ్మ గుడి స్థల వివాదంతో..

గ్రామంలోని ఎస్సీ కాలనీలో గల పాపమ్మ గుడి స్థలాన్ని రుద్రారం యాదయ్య, రుద్రారం మల్లేష్, రుద్రారం చినయాదయ్య కుటుంబ సభ్యులు కొంత మేర ఆక్రమించారని, ఈ విషయమై రెండు వర్గాలుగా విడిపోయిన ఎస్సీలు గుడి స్థల వివాదంలో పరస్పరం దాడులు చేసుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ క్రమంలో యాదయ్య, మల్లేష్, చినయాదయ్య కుటుంబాలను కులపెద్దలు కుల బహిష్కరణ చేశారని, తమను కుల బహిష్కరణ చేసేందుకు బండారు మల్లయ్యే కారణమంటూ యాదయ్య, మల్లేష్, చినయాదయ్య కుటుంబాలు అతడిపై కక్ష పెంచుకున్నారని ఎస్‌ఐ వివరించారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఇరువర్గాలకు సర్దిచెప్పినట్లు తెలిపారు.

దారికాచి.. మాటువేసి..

అయితే గ్రామంలో బండారు మల్లయ్య ఉన్నంత వరకు తాము రాజకీయంగా, సామాజికంగా ఎదగలేమని భావించిన యాదయ్య, మల్లేష్, చినయాదయ్యలు ఎలాగైనా మల్లయ్యను అంతమొందించాలని పథకం రచించారని, మల్లయ్య మంగళవారం ఉదయం గ్రామ శివారులో తన వ్యవసాయ పొలం వద్దకు బైక్‌పై వెళ్తుండగా.. దారికాచి యాదయ్య, మల్లేష్, చినయాదయ్యతో పాటు మరో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మల్లయ్యపై మారణాయుధాలతో దాడి చేశారని ఎస్‌ఐ వివరించారు. ఈ దాడిలో మల్లయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడని, అదే సమయంలో గ్రామానికి చెందిన మరో రైతు అటుగా వస్తుండటాన్ని గమనించి దాడి చేసిన వారు అక్కడి నుంచి పరారయ్యారని పేర్కొన్నారు. మల్లయ్యను 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడ నుంచి నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్‌కు తీసుకెళ్లి ప్రాథమిక వైద్యం అందించి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మల్లయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుడి భార్య బండారు చంద్రనీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

ఘటనా స్థలాన్ని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పరిశీలించారు. గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు విషయంపై పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఎస్పీ వెంట శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ సైదులు ఉన్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

బోరు మోటార్ల వైర్లు చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నార్కట్‌పల్లి: వ్యవసాయ పొలాల వద్ద బోరు మోటార్ల వైర్లు చోరీ చేస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు నార్కట్‌పల్లి ఏఎస్‌ఐలు నర్సిరెడ్డి, ఆంజనేయులు తెలిపారు. నూతనకల్ మండలం గోరెంట్లతండాకు చెందిన లావుడ్య తిరుమలేష్ చెడు వ్యవసనాలకు అలవాటుపడి హయత్‌నగర్‌కు చెందిన తన స్నేహితులు సైదా, శ్రీనుతో కలిసి వ్యవసాయ బావుల బోరు మోటార్ల వైర్లను చోరీ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీన నార్కట్‌పల్లి నుంచి ఏనుగుల దోరి గ్రామానికి వెళ్లే దారిలో సామ కొండల్‌రెడ్డి వ్యవసాయ భూమి వద్ద బోరు మోటారు వైరు చోరీ చేసేందుకు ప్రయత్నించారు. మంగళవారం నార్కట్‌పల్లి బస్టాండ్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన తిరుమలేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు నిజం ఒప్పుకున్నాడు. దీంతో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించనట్లు ఏఎస్‌ఐలు పేర్కొన్నారు. డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో సీఐ నాగరాజు, ఎస్‌ఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పంటల సాగులో ఎరువుల వాడకమే కీలకం


పెద్దవూరలో యూరియా చల్లుతున్న రైతు

పాడిపంట

పెద్దవూర: పంటల సాగులో ఎరువుల వాడకం కీలకమని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ తెలిపారు. ఎరువుల వినియోగానికి సంబంధించి రైతులు పాటించాల్సిన పద్ధతులు ఆయన మాటల్లోనే..

సేంద్రియ ఎరువులతో ఎంతో మేలు..

సేంద్రియ ఎరువుల వాడకం మూలంగా అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంది. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని సొంతంగా వాటిని తయారు చేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గుతాయి. పశువుల ఎరువు, కంపోస్టు, ఫిల్టర్ మడ్డి, పచ్చిరొట్ట ఎరువులు, వ్యవసాయ వ్యర్థ పదార్థాల వాడకం, జీవన ఎరువుల వాడకం ప్రాధాన్యతను గుర్తించాలి.

రసాయనిక ఎరువులతో నష్టం..

రసాయనిక ఎరువుల వాడకం వల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా భూసారంలో మార్పులు సంభవిస్తాయి. మరోవైపు పంట ఉత్పత్తుల్లో రసాయనిక అవశేషాలు మిగిలి ఉండి మార్కెట్లో దాని ప్రభావంతో డిమాండ్ తగ్గి ధరలు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉంది. రసాయనిక ఎరువులు వాడడం తగ్గించాలి. నీటి వాడకం వల్ల క్రిమిపీ పంట దిగుబడులు కూడా తగ్గుతాయి.

ఎరువుల వాడకంలో పాటించాల్సిన పద్ధతులు..

- లోతు దుక్కుల వల్ల భూమి పొరలు గుల్లబారి తేమను బాగా నిల్వ ఉంచుకుంటాయి. వేసిన ఎరువును ఎక్కువ శాతం మొక్కలు తీసుకుంటాయి.
- పంటలో ఉన్న కలుపును పూర్తిగా తొలగించిన అనంతరం తేమ ఉన్న దశలోనే ఎరువులు చల్లుకోవాలి.
- అన్ని పోషకాల్లో నత్రజని పోషకం వృథా ఎక్కువగా ఉంటుంది. యూరియాను వేప పిండితో కలిపి గానీ, వేప నూనె కలుపుకుని వాడితే నత్రజని నెమ్మదిగా విడుదలవుతూ వృథా తగ్గుతుంది.
- కోల్‌తార్‌తో 2 లీటర్ల కిరోసిన్‌తో మిశ్రమం చేసి రెండు బస్తాల యూరియాలో కలిపితే మంచి ఫలితాలు వస్తాయి. అర బస్తా యూరియాను ఒక బస్తా తడి, పొడి మట్టితో కలిపి 24 గంటలు నీడలో ఉంచి ఆ తర్వాత నేలకు అందిస్తే వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

ఏ దశలో ఎరువులు వాడాలంటే..

పంటలకు నత్రజని అవసరం చివరి దశ వరకు ఉంటుంది. నత్రజని ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులో రెండు మూడు కీలక దశల్లో వాడుకోవాలి. ఏపుగా పెరిగేందుకు, పూత, మొగ్గ దశ, పంట దిగుబడి పెరిగే దశల్లో ప్రధానంగా వాడుకోవాలి. నత్రజనిని యూరియా రూపంలో వాడే సమయంలో వృథాని అరికట్టడానికి పైన చెప్పిన మిశ్రమాలను ఉపయోగించాలి. భాస్వరం ఎరువును మొత్తం మోతాదును విత్తే సమయంలో చివరి దుక్కిలో వేసుకోవాలి. దీంతో ఎరువు భూమిలో నిల్వ ఉండి కొద్దికొద్దిగా పంటకు అందుతుంది. పొటాష్ ఎరువులు మొక్కలో రోగ నిరోధక శక్తిని పెంచడంతో పాటు నాణ్యత కలిగిన ఉత్పత్తి వచ్చేలా చేస్తాయి.

వెదజల్లే పద్ధతి.. ప్రయోజనాలు

సాధారణంగా ఎరువులను రెండు పద్ధతుల్లో వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో మొక్కలు దగ్గర దగ్గరగా ఉంటే మేలు జరుగుతుంది. వరుస క్రమంలో లేని మొక్కలకు, వేళ్లు భూమిలో అల్లుకుపోయే పైర్లకు ఈ పద్ధతి అనుకూలంగా ఉంటుంది. వరికి కూడా ఈ పద్ధతి మేలు చేస్తుంది.

పాదుల్లో ఎరువు వేసే పద్ధతి

మొక్కల దగ్గర ఎరువులు వేసే పద్ధతి ద్వారా పోషక వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. వృథా కూడా తగ్గుతుంది. నిర్ణీత వరుసల్లో మొక్కలు ఉన్నప్పుడు పొలాన్ని 2 అంగుళాల మేర లోతు చేసుకుని తేమ ఉన్నప్పుడు మొక్కల మొదళ్ల దగ్గర ఎరువు పడేలా వేయాలి. చిన్నపాటి గుంతలు తీసి ఎరువులు వేసిన సమయంలో దానిని మట్టితో కప్పేలా చేసుకోవాలి.